సిగ్నలింగ్ వ్యవస్థ నమూనా




కోల్‌కతా మెట్రోరైలు బోగీ

వింటేజ్ బోగీలు

# విశేషాల చుక్ చుక్ రైలు..

**రైలు ప్రయాణం అంటే ప్రకృతి అందాలను కళ్లముందుంచుతూ మాటలకందని మధురానుభూతిని పంచుతుంది. ఎంత దూరమైనా అలుపెరుగని ఉల్లాసం మన సొంతం. అన్నింటినీ మించి అతిచౌక! ఇక ప్రయాణానికి అవసరమైన బోగీల నిర్మాణానికి పెరంబూరులోని ఇంటెగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) 1952 మార్చిలో ఏర్పాటైంది. దీని ఆధ్వర్యంలో ఏర్పాటైన మ్యూజియం ఎన్నో విశేషాల సమాహారంగా నిలుస్తోంది.**

**- చెన్నై, న్యూస్‌టుడే**

ఐసీఎఫ్‌లో తొలి రైలుపెట్టెను 1955 అక్టోబరు 2న ఆనాటి ప్రధాని నెహ్రూ ఆవిష్కరించారు. ప్రస్తుతం ఏటా 1500 పెట్టెల నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతులను సమకూర్చుకుంది. తొలిదశలో స్విస్ సంస్థ అందించిన సాంకేతిక పరిజ్ఞానంతో మూడో తరగతి రైలు పెట్టెల నిర్మాణానికే ఇది పరిమితమైంది. ప్రస్తుతం దేశీయ పరిజ్ఞానంతో ఎయిర్‌కండిషన్డ్, సెల్ఫ్ ప్రొపెల్డ్, డబుల్ డెక్కర్, లగ్జరీ టూరిస్టుకార్లు వంటి పెట్టెల నిర్మాణం చేపట్టింది. విదేశాలకు కూడా అక్కడి అవసరానికి తగినట్టు పెట్టెలను నిర్మించి అందిస్తోంది. ఐఎస్‌వో 9001, ఐఎస్‌వో 14001, ఐఎస్‌వో 18001 నాణ్యతా పత్రాలు సంపాదించడం మైలురాళ్లు.

**వారసత్వ సంపదగా..**

150 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన భారతీయ రైల్వేలు ఎన్నో మార్పులతో సాధించిన ప్రగతిని పదిలపరుస్తూ ముందు తరాల వారికి అందజేయాలనే లక్ష్యంతో ప్రాంతీయ రైలు మ్యూజియం ఏర్పాటుకు ఐసీఎఫ్ శ్రీకారం చుట్టింది. రైల్వేల ప్రగతిని, ఆవిష్కరణలను, నైపుణ్యతను వివరించేలా రూపొందించిన మ్యూజియాన్ని వారసత్వసంపదగా తీర్చిదిద్దారు. ప్రకృతి రమణీయకత ఉట్టిపడేలా 6.25 ఎకరాల విస్తీర్ణంతో నందనవనంలా ఏర్పాటు చేసిన మ్యూజియాన్ని అప్పటి రైల్వే మంత్రి నితీష్‌కుమార్ 2002 మార్చి 31న ప్రారంభించారు. మ్యూజియంలో అడుగుపెట్టగానే మద్రాసు బీచ్- తాంబరం సబర్బన్ సెక్షన్‌లో కొన్ని దశాబ్దాలపాటు పనిచేసి విశ్రమించిన మీటర్‌గేజి ఈఎంయూలు స్వాగతం పలుకుతాయి. కాస్త ముందుకు వెళితే మ్యూజియం భవనం ఆహ్వానిస్తుంది. ఇందులో వారసత్వ సంపదగా గుర్తించిన రైలు పెట్టెలు, ఐసీఎఫ్ తయారుచేసిన పలురకాల రైలు నమూనాలను ఎంతో అందంగా అమర్చారు. భారతీయ రైల్వేల పుట్టుపూర్వోత్తరాలు.. అందునా ప్రత్యేకించి రైల్వేలు జాతీయం చేయడానికి ముందున్న వివిధ రైల్వే సంస్థల లోగోలు కూడా దర్శనమిస్తాయి. అలనాటి కొన్ని వస్తువులు నేటికీ పనిచేస్తూనే ఉండటం అబ్బురపరిచే అంశమే. భవనం మధ్యలో ఏర్పాటు చేసిన 'సిగ్నలింగ్ వర్కింగ్ మోడల్' ప్రధాన ఆకర్షణ. భవనం వెలుపల ఓ వైపు తొలిదశలో ఉపయోగించిన రైలింజన్లు, పలు రకాల పెట్టెలు, మరోవైపు ఐసీఎఫ్ తయారుచేసిన బోగీలు బారులుదీరాయి. అన్నింటినీ మించి చిన్నారుల వినోదం కోసం పలురకాల క్రీడాపరికరాలు ఏర్పాటు చేశారు. అంతేగాక సిద్ధంగా ఉంచిన టాయ్‌ట్రైన్‌లో ప్రయాణం చేస్తూ మ్యూజియాన్ని ఓసారి చుట్టిరావొచ్చు సందర్శకుల కోసం వాటర్‌కూలర్, టాయిలెట్లు, ఫుడ్‌కోర్టు, విశ్రాంత గుడారాలు.. ఇలా ఓ విహారస్థలంగా దర్శనమిస్తుంది. మొత్తానికి రైల్వే మ్యూజియం రైళ్ల చరిత్రను తెలిపే ఓ సమాచార ఖని.

## విజ్ఞాన ఖని ప్రాంతీయ మ్యూజియం




మ్యూజియం భవనం




పురాతన సిగ్నల్ దీపాలు

## ముఖ్య వివరాలు..

**ఎక్కడుందంటే:** పెరంబూరులోని ఐసీఎఫ్ ఫర్నీషింగ్ విభాగం సమీపంలో

**సందర్శన వేళలు:** రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు. (సోమవారం సెలవు)

**టిక్కెట్ ధర:** రూ. 10.

**టాయ్‌ట్రెయిన్ టిక్కెట్ ధర:** రూ. 10

**ఫోన్ నెంబర్లు:**

2620 1014, 2614 6306, 2614 6593.





ఫౌలర్ ప్లావింగ్ ఇంజిన్

క్రేన్

టాయ్ ట్రైన్

పలు రకాల ఇంజన్లు